సాక్షి
సిద్దిపేట
మంగళవారం। 16। జూలై। 2024



గెజిటెడ్ సంతకానికి పాట్లు

ప్రభుత్వ ఉద్యోగాలు, ధ్రువపత్రాల జారీకి గెజిటెడ్ అధికారుల సంతకం తప్పనిసరి.

వివరాలు 8లో ▸



అంగన్‌వాడీ కేంద్రం ఏదీ?

ప్రత్యేక గ్రామ పంచాయతీ అయినా అంగన్ వాడీ సేవలు అందడం లేదు.

వివరాలు 9లో ▸



పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

పారిశుద్ధ్య నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి చెప్పారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సూక్ష్మ రాతి పనిముట్లు లభ్యం



రాతియుగం నాటి వస్తువులు

నంగునూరు(సిద్దిపేట): నంగునూరులోని జోకిరమ్మ బండపై కొత్తరాతి యుగం నాటి రాతి గొడ్డళ్లు, శాతవాహన కాలం నాటి టెర్రస్ కోట బొమ్మలు లభ్యమయ్యాయని చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపాడు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, ఎంతో గొప్ప చరిత్ర కలిగిన ఈ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా పరిశోధనలు చేస్తున్నామన్నారు. గ్రామానికి దక్షిణం వైపు ఉన్న బండపై ఇటీవల సూక్ష్మరాతి పరికరాలు (మైక్రోలిథిక్ టూల్స్) దొరికాయన్నారు. క్వార్ట్, చార్ట్, చాల్కోడ్, జాస్పర్, చెకుముఖి రాళ్లతో తయారు చేసిన బ్లేడు, బాణం, ములికిగా గుర్తించామని చెప్పారు.

రేపటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో రేపటి నుంచి సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ అనురాధ సోమవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి ఆగస్టు 1 వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ఈ సమయంలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని సూచించారు. ఒక వేళ నిర్వహించాల్సి వస్తే ముందస్తు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అదేవిధంగా డీజే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా వచ్చేనెల 1 వరకు పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఐ కావలెను




అక్కన్నపేట మండల పోలీస్‌స్టేషన్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలానికి ఎస్‌ఐ కావలెను. ఈ పోస్టు సుమారుగా 10 రోజులకుపైగా ఖాళీగా ఉంది. ఇక్కడ పని చేసిన ఎస్సై తాండ్ర వివేక్ ఇటీవల బదిలీపై కరీంనగర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. సిద్దిపేట జిల్లాలోనే పెద్దమండలంగా అక్కన్నపేటకు పేరుంది. అలాగే క్రైమ్ రేట్ కూడా ఎక్కువ. మండలంలో దాదాపు 33 వేల జనాభా, 32 గ్రామాలతో పాటు 60కి పైగా తండాలు, మారుమూల పల్లెలున్నాయి. రెండ్రోజులకోసారి ఎక్కడో ఒక చోట అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటాయి. పలు గ్రామాల్లో ప్రభుత్వ నిషేధిత వస్తువుల క్రయవిక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా జరుగుతుంటాయి. గెట్టు పంచాయితీలు, భూతగాదాలతో రోజూ పదుల సంఖ్యలో ఠాణా మెట్లు రైతులు ఎక్కుతుంటారు. ఇప్పటికైనా ఎస్‌ఐని నియమించాలని కోరుతున్నారు.

గడువు పొడిగింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచిత సివిల్స్ శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 31వతేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత సోమవారం తెలిపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ స్టడీ సర్కిల్లో రెసిడెన్షియల్ తో కూడిన ఉచిత శిక్షణను అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు లక్షల లోపు ఆదాయ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మెరిట్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్ల కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నవీన్‌గౌడ్



జిల్లా నూతన కార్యవర్గ నియామక పత్రాలు అందుకుంటున్న నవీన్‌గౌడ్


సిద్దిపేటకమాన్: బీసీ సంక్షేమ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా కంకటి నవీన్‌గౌడ్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శిగా సాయికిరణ్, యువజన విభాగ అధ్యక్షుడిగా భార్గవ్, ఉపాధ్యక్షుడిగా పవన్, ప్రధాన కార్యదర్శిగా సురేశ్‌లు నియమితులయ్యారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్ మాట్లాడుతూ, బీసీల హక్కుల కోసం పోరాడుతామన్నారు. వారికి అండగా ఉంటూ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

2.09 లక్షల మందికి మాఫీ

సుమారుగా రూ.2,026 కోట్లు

- రేషన్‌కార్డు లింకుతో తగ్గనున్న రైతుల సంఖ్య

ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయనున్నారు. ఈ మేరకు పంటల రుణమాఫీపై తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను సోమవారం విడుదల చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా రూ.2 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న వారు 2.09 లక్షల మందికి రూ. 2026 కోట్ల రుణ మాఫీ కానుంది.



సాక్షి, సిద్దిపేట: రేషన్ కార్డు ఉన్న రైతు కుటుంబానికే రుణమాఫీ అవుతుందని ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలలో ఉంది. దీంతో రేషన్ కార్డు లేని రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ మొత్తంలో ఆదాయపు పన్ను చెల్లించే వారికి వర్తించదు. అలాగే రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని మార్గదర్శకాల్లో తెలపడంతో తక్కువ మంది అర్హులు అయ్యే అవకాశం ఉంది. కొత్తగా పెళ్లయి వేరు పడిన వారు వ్యవసాయం చేస్తున్నారు. కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ నిలిచిపోవడంతో కొందరికే రుణమాఫీ కానుంది. జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 2,91,587 ఉండగా అందులో 8,95,569 యూనిట్‌లున్నాయి. కాగా, రుణమాఫీ నగదు నేరుగా లబ్ధిదారుల రుణఖాతాల్లోనే జమ కానుంది.

లెక్కలో తీసుకున్న సమయం ఇదే

జిల్లాలో 12 డిసెంబర్ 2018 నుంచి 13 డిసెంబర్ 2023 వరకు సమయాన్ని పరిగణలోకి తీసుకున్నారు. అయితే రూ. 2 లక్షల వరకు 33 బ్యాంక్‌లలో పంట రుణాలు పొందిన వారు 2,09,093 మంది రైతులు ఉన్నారు. వీరికి రుణ మాఫీ సుమారుగా రూ 2026.85కోట్లు కానుంది. ఇప్పటికే రుణం తీసుకున్న రైతుల వివరాలను బ్యాంకర్ల నుంచి సేకరించారు. కాగా, ఈ ప్రకటన కోసం ఆశగా కొందరు రైతులు ఎదురు చూశారు. రేషన్ కార్డు ప్రామాణికం చేయడంతో పలువురు నిరుత్సాహానికి లోనవుతున్నారు. రేషన్ కార్డులు ఉన్న రుణ గ్రహీతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల కేంద్రాల్లో సహాయక కేంద్రాలు

జిల్లాలోని 26 మండల కేంద్రాల్లో రైతుల సందేహాలను తీర్చేందుకు ప్రత్యేకంగా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో రైతులకు సంబంధించిన సందేహాలను తీర్చనున్నారు. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో అధికారులు పరిష్కరించనున్నారు. అలాగే మరిన్ని వివరాలను వెబ్ పోర్టల్‌లో చూసుకోవచ్చు.

రేషన్ కార్డు ప్రామాణికంగా..



రేషన్ కార్డు ప్రామాణికంగా .. రాష్ట్రంలో రైతు రుణమాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనికి అనుగుణంగా జరగనుంది. 12 డిసెంబర్ 2018 నుంచి 13 డిసెంబర్ 2023 వరకు రూ. 2 లక్షల వరకు రుణం తీసుకున్న వారికి వర్తించనుంది. రూ. 2 లక్షలకు మించి రుణం పొందిన వారు మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

–హరిబాబు, ఎల్‌డీఎం

బీఆర్‌ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ

పార్టీని వీడిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు ఒకేసారి డబుల్‌షాక్ తగిలింది. పార్టీకి చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్ కూడా పార్టీకి గుడ్‌బై చెప్పారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ పరిణామంతో ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది. ఆ పార్టీకి ఉమ్మడి మెదక్ గట్టి కంచుకోటగా పేరుంది. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 11 స్థానాల్లో ఏడు చోట్ల విజయం సాధించింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ.. ఉమ్మడి జిల్లాలో మాత్రం పార్టీ పట్టు నిలుపుకుంది. కానీ ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలు పార్టీని వీడటం చర్చనీయాంశంగా మారింది.

పటాన్‌చెరు బీఆర్‌ఎస్ ఖాళీ..

వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించిన మహిపాల్‌రెడ్డికి నియోజకవర్గంలో గట్టి పట్టుంది. అయితే గూడెం తోపాటు గాలి అనిల్‌కుమార్‌లు పార్టీని వీడటంతో ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు చెప్పుకోదగిన నాయకులు లేకుండా పోయారు. ఆ పార్టీకి చెందిన ఇద్దరు జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, ఓ మున్సిపల్ చైర్మన్, మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు గూడెం వెంట వెళ్లనున్నారు.



సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, గాలి అనీల్ కుమార్

త్వరలోనే వీరి చేరికలు కూడా ఉంటాయని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కాగా, గూడెంను కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ వర్గం వ్యతిరేకించింది. ఆయన చేరిక ఖాయమైన నేపథ్యంలో కాటా వర్గీయులు జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ విషయంలో అధినాయకత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ అందడంతో ప్రయత్నాలేవీ ఫలించలేదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఎన్నికల ముందు గులాబీపార్టీలోకి..

జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన గాలి అనిల్‌కుమార్ గత అసెంబ్లీ ఎన్నికల్లోనే ఆయన హస్తం పార్టీని వీడి గులాబీ పార్టీలో చేరారు. మెదక్ లోక్‌సభ స్థానానికి టికెట్ ఆశించిన ఆయనకు పార్టీ అధినాయకత్వం జహీరాబాద్ స్థానం కేటాయించింది. ఆ ఎన్నికల తర్వాత పార్టీకి అంటీ ముట్టనట్లుగా ఉన్న ఆయన తాజాగా ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది.

స్కిల్స్‌పై పట్టు.. భవిష్యత్‌కు మెట్టు

జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్



మాట్లాడుతున్న భాస్కర్

కొండపాక(గజ్వేల్): జీవన విధానాన్ని నిర్ణయించేది విద్యార్థి దశేనని సిద్దిపేట జిల్లా సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని దుద్దెడ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులకు లైఫ్ సిల్క్ కమ్యూనికేషన్స్ పెంపొందించడం కోసం దేశ్ పాండే స్వచ్ఛంద సంస్థ నిర్వహించే శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పాఠ్యాంశాలతో పాటు వీటిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు స్కిల్స్‌తో పాటు ఆంగ్ల నైపుణ్యాన్ని సాధించేందుకు స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్కిల్ ఇన్ విలేజ్ కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయడం సంతోషదాయకమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రోగ్రాం ఇంపాక్ట్ డివిజినల్ అధికారి మధు మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 40 పాఠశాలల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి సంతోశ్, దుద్దెడ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దివ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణుల ఎంపికలు



క్రీడా మైదానంలో క్రీడాకారిణులు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు సోమవారం జరిగాయి. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న సెలక్షన్స్ ప్రక్రియ రెండు రోజుల పాటు జరగనుంది. జిల్లాల నుంచి దాదాపు 74 మంది క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఎంపికైన వారు జులై 29 వరకు సిద్దిపేట జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన 30 మంది క్రీడాకారిణులను ఆగస్టు 1న కర్ణాటకలో జరిగే జాతీయ స్థాయి ఫుట్ బాల్ టోర్నీలో పాల్గొంటారని సిద్దిపేట అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్బర్ నవాబ్ తెలిపారు.

నేటి వనమహోత్సవానికి నటుడు సుమన్ రాక

కొండపాక(గజ్వేల్):స్థానిక సత్యసాయి ప్రశాంతి నికేతనం మహిళా కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వన మహోత్సవానికి నటుడు సుమన్, కలెక్టర్ మనుచౌదరి హాజరవుతున్నారని చైర్‌పర్సన్ పూర్ణిమా తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నాసిరకం వడ్లు అంటగట్టారు



పెద్దతండాలో నారుమడులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు

- రూ.లక్ష నష్టపరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్
- నారుమడులను పరిశీలించిన అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): నాసిరకం వడ్లు అంటగట్టారని ఆరోపిస్తూ పలువురు రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం అక్కన్నపేట మండలం పెద్దతండాలో పలువురి రైతుల నారుమడులను అధికారులు పరిశీలించారు. అనంతరం ఒకరిద్దరూ రైతులు మాట్లాడారు. జమ్మికుంటలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) వారి నుంచి 100 వడ్ల బస్తాలను 30 మంది రైతులు తీసుకొచ్చారన్నారు. 25 కిలోల వడ్ల బస్తా రూ.1,000 చొప్పున కొన్నామన్నారు. వాటిని నానబెట్టి మండె కట్టి ఆరు రోజులైనా మొలకెత్తలేదన్నారు. ఆలస్యంగా మొలకెత్తడంతో నారు ఎదుగుదల కూడా సరిగ్గా లేదన్నారు. ఒక నారుమడి ఎకరం రావాల్సి ఉండగా 10 గుంటలకే సరిపోతోందన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రతి రైతుకూ ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కేవీకే ఎదుట నిరాహార దీక్షలకు కూర్చుంటామని హెచ్చరించారు. ఈ విషయమై కేవీకే శాస్త్రవేత్తలు విజయ్, శ్రీనివాస్, వ్యవసాయ అధికారి నాగరాజు పలు నారుమడులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతులు మండె సరిగా కట్టక లేదని దీంతోనే సమస్య వస్తోందన్నారు. కొంతమందివి బాగానే ఉన్నాయని స్పష్టం చేశారు. నారు సరిగ్గా ఎదుగుదల లేకపోవడానికి కారణాలు తెలుసుకునేందుకు సంబంధిత ఉన్నతాధికారుల పరిశీలనకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో రైతులు గుగులోతు రాంబాబు, హేమ నాయక్, లింగనాయక్, భీమానాయక్, కసనానాయక్, రూప్‌సింగ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి

సిద్దిపేట కలెక్టరేట్ వరకు పాదయాత్ర

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల నుంచి, గుడికందుల వరకు బీటీ రోడ్డును నిర్మించాలని అల్వాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులు సిద్దిపేట కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ బాలకిష్టయ్య, మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ, అల్వాల నుంచి గుడికందుల వరకు నిర్మించే బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను పూర్తిగా నిలిపి వేశారన్నారు. గతేడాదిగా నిర్మాణానికి మోక్షం లభించడం లేదని మండిపడ్డారు. రోడ్డుపై గుంతలు పడి తరచుగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. గుంతల రోడ్డుపై వెళ్లే వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయమై అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదని మండిపడ్డారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి మారక పోవడంతో పార్టీలకతీతంగా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశామన్నారు. మాజీ ఉప సర్పంచ్ దిలీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థులకు న్యాయం చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్ ద్వారా సీటు వచ్చిన దళిత విద్యార్థులకు న్యాయం చేయాలని బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య (బీడీఎస్ఎఫ్) నాయకులు అన్నారు. ఆ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దబ్బేట ఆనంద్ మాట్లాడుతూ, బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లలో లక్కీ డ్రాలో సీటు వచ్చిన విద్యార్థులకు జీఓ ప్రకారం రావాల్సిన స్టడీ మెటీరియల్ ఇవ్వాలన్నారు. గతంలో పాఠశాలలకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని ప్రభుత్వం విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ, పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీఇచ్చారు. వారు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అన్నింట్లో రాణించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బీడీఎస్ఎఫ్ నాయకులు

అర్జీలు ఇచ్చి.. సమస్యలు నివేదించి..

- 61 దరఖాస్తులను స్వీకరించిన అదనపు కలెక్టర్‌లు
- సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు

సిద్దిపేటరూరల్: స్వీకరించిన అర్జీలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు ఇచ్చిన అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేలా వ్యవహరించాలన్నారు. మొత్తం 61 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా, డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

● కరెంట్ బిల్లుల చెల్లింపుల కోసం పాట్లు



వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఫోన్ పే, గూగుల్ పే ద్వారా చెల్లించే వారు. కొద్ది రోజుల క్రితం థర్డ్ పార్టీ యాప్ ద్వారా కరెంట్ బిల్లుల చెల్లింపులపై ఆర్బీఐ నిబంధనలు విధించింది. దీంతో తమ బిల్లులను చెల్లించేందుకు వినియోగదారులు విద్యుత్ శాఖ కార్యాలయంలో భారీగా క్యూలో నిలబడి బిల్లులు చెల్లించారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రభుత్వం పెన్షన్‌దారులకు సంబంధించి చాలా రోజులుగా ఉన్న పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగుల పట్ల కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నాయన్నారు. పెండింగ్ డీఏలు, డీఆర్‌లను విడుదల చేసి, ఎంప్లాయిస్ స్కీం ద్వారా అన్ని కార్పొరేట్ హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య చికిత్సలు అందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను సైతం విడుదల చేయాలన్నారు. ఆ మేరకు అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

భూదాన్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని..



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేర్యాలలో కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అక్రమంగా పట్టా చేసుకున్న భూదాన్ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, చేర్యాల రెవెన్యూ పరిధిలో గల 1030 సర్వే నంబర్‌లోని 07–01 గుంటల భూదాన్ భూమిని రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పట్టా చేసుకున్నారని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు శశిధర్, గోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

దుబ్బాక : అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని దుబ్బాక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ గరీమా అగర్వాను కలిసివినతి పత్రం అందించారు. ఏళ్ల నుంచి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. జర్నలిస్టుల సమస్యలు గుర్తించి న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజమల్లు, వనం రమేశ్, ఎల్లం, స్వామి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి కేసులో..

నిందితుడికి 20 ఏళ్ల జైలు, జరిమానా

పటాన్‌చెరు టౌన్ : లైంగిక దాడి కేసులో నిందితుడికి కోర్టు జైలు, జరిమానా విధించిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు పట్టణం అల్విన్ కాలనీకి చెందిన ఇటిక్యాల నవీన్ (30) పక్క ఇంట్లో ఉన్న ఓ మూడున్నరేళ్ల బాలికపై అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల 2018 లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో భాగంగా సోమవారం జిల్లా పోక్సో కోర్టులో న్యాయమూర్తి జయంతి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ వాదనలను విన్న న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాదిపాటు జైలు శిక్ష పొడగించబడుతుందని తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అభినందించారు.

స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం


సిద్దిపేటరూరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరుతూ ధర్మ సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఫీజుల సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ బకాయిలను విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులను నివారించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్, జిల్లా నాయకులు ఎల్లం, అంజిబాబు, డీవీ రాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన సోమవారం జగదేవ్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన బుద్ద రాములు, గుర్రం రాములు కలిసి లారీలో 80 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా హైదరాబాద్ తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు వాహనం తనిఖీ చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గెజిటెడ్ సంతకానికి పాట్లు

- అధికారులు పెట్టకపోవడంతో ఇబ్బందులు
- గంటల తరబడి ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు
- పథకాలకు దూరమవుతున్న లబ్ధిదారులు
- పోటీ పరీక్షల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంతకం తప్పనిసరి



సిద్దిపేటరూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, పలు ప్రభుత్వ ఉద్యోగాలు, ధ్రువపత్రాల జారీకి గెజిటెడ్ అధికారుల సంతకం తప్పనిసరి. కానీ ఈ సంతకం కోసం ప్రజలు, నిరుద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఉద్యోగ సాధన, పథకాల దరఖాస్తు, పేపర్లు జత చేయడం, పూరించడం, ఆన్‌లైన్ దరఖాస్తు చేయడం ఒక ఎత్తయితే గెజిటెడ్ అధికారి సంతకం కోసం పడుతున్న పాట్లు మరో ఎత్తు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ వంటి ప్రభుత్వ పథకాలకే కాకుండా ఉద్యోగాల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి అయ్యింది. దీంతో అధికారుల సంతకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

గ్రామాల్లోని జెడ్పీహెచ్‌ఎస్ హెడ్ మాస్టర్లు సీనియార్టీ ఆధారంగా గెజిటెడ్ అధికారులుగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో గెజిటెడ్ సంతకాల విషయంలో కొన్ని నెలల నుంచి సుముఖతను చూపడం లేదు. వివిధ ప్రభుత్వ పథకాలకే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలు, పైచదువుల దరఖాస్తులకు సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి చేయించాల్సి ఉంటుంది. కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ దరఖాస్తు సమయంలో నూతన దంపతులది మొదటి వివాహమేనని ధ్రువీకరించడానికి ఈ సంతకం ప్రధానంగా అవసరం.

అలాగే లీగల్ ఎయిడ్ సర్టిఫికెట్, పోటీ పరీక్షల దరఖాస్తులపై ఫొటో గుర్తింపు. పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లో పేరు మార్పు, పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్, కోర్టుకు సమర్పించే జిరాక్స్ కాపీలపైనా, ఇటీవల ప్రతీ పోటీ పరీక్షలు టీచర్ పోస్టులకు, గ్రూప్ 4 పోస్టులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వెళ్లేటప్పుడు గెజిటెడ్ అధికారి సంతకం అవసరం పడింది. ఈ క్రమంలో గెజిటెడ్ అధికారి సంతకం కోసం నిరుద్యోగులు తిప్పలు పడ్డారు. గెజిటెడ్ సంతకం పూర్తి అయిన తర్వాతే ఆ దరఖాస్తులోని సమాచారమంతా వాస్తవమని ధ్రువీకరించినట్లు నిర్ధారణ అవుతుంది.

గెజిటెడ్ అధికారులు ఎవరంటే...

గెజిటెడ్ అధికారుల్లో క్లాస్–1, క్లాస్–2 ఉన్నారు. వీరిలో ఆఫీసర్స్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ప్రభుత్వ రీసెర్చ్ ఆర్గనేజేషన్‌లోని శాస్త్రవేత్తలు, యూనివర్సిటీల వీసీలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీల ఫ్యాకల్టీ మెంబర్లు, గ్రూప్–ఏ సర్వీస్ రూల్స్ కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు. కంట్రోలర్లు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఎస్‌డీఓ (సబ్‌డివిజనల్ ఆఫీసర్), బీడీఓ (బ్లాక్ డెవలప్మెంట్ ఆఫీసర్), సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఆదాయ పన్ను శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు గెజిటెడ్ ఆఫీసర్ల పరిధిలోకి వస్తారు. వీరే కాక మరికొంత మంది అధికారులు సైతం గెజిటెడ్ సంతకం కలిగి ఉన్నారు.

తప్పని ప్రదక్షిణలు

దరఖాస్తులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించడం దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల వారికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఏ కార్యాలయానికి వెళ్లినా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలలు, కళాశాలలు, పీహెచ్‌సీలు ఇలా ఏ కార్యాలయానికి వెళ్లినా సంతకం చేయించుకోవడం ఇబ్బందిగా మారింది. కొందరు విసిగిపోయి పథకాలకు దరఖాస్తు చేయకుండానే వదిలేస్తున్నారు. తప్పనిసరిగా అవసరమైన వారు మాత్రం అధికారుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

వెసులుబాటు కల్పించాలి



ప్రభుత్వ పథకాలు, పలు ఉద్యోగాలకు గెజిటెడ్ తప్పనిసరి ఉన్న క్రమంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గెజిటెడ్ సంతకాల విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజలు వారి సమయంతో పాటుగా , డబ్బులు కూడా నష్టపోవడం జరుగుతుంది.

–గ్యార శ్రీనివాస్, రాఘవాపూర్



వర్క్‌షాపులో ప్రొఫెసర్లు, కాలేజీ ప్రతినిధులు

ఔషధ రంగంలో నిరంతర పరిశోధనలు

నర్సాపూర్ : ఔషధ రంగంలో నిరంతరం పరిశోధనలు కొనసాగుతున్నాయని జపాన్‌లోని సాగా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ యుకియోనగానో అన్నారు. స్థానిక బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో డీఎన్‌ఏ సీక్వెన్సింగ్ అనాలిసిస్ అనే అంశంపై సోమవారం ప్రారంభమైన అంతర్జాతీయ వర్క్‌షాపులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయా రంగాల్లో పరిశోధనలు ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ.. పరిశోధనలను అందించడంలో తమ కాలేజీ ముందంజలో ఉంటుందన్నారు. విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ విష్ణురాజు సదస్సులకు, పరిశోధనలకు సంపూర్ణ మద్దతు అందజేస్తారని, ఆయన సహకారంతో తమ కాలేజీలో విద్యార్థులకు ఉపయోగపడే అనేక సదస్సులు, పరిశోధనలు ఇతర కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె మాట్లాడుతూ.. వర్క్‌షాప్ రెండు వారాల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైపర్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్, ఫార్మసీ హెచ్‌ఓడీ విష్ణు, కాలేజీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ రాజు ఆడెలా, మేనేజర్ బాపిరాజు, ఏఓలు అశోక్ రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట భారీ మోసం

- రూ.14.06 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి
- మరో చోట రూ.1.30 లక్షలు

పటాన్‌చెరు టౌన్ : నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్ వేర్ ఉద్యోగిని బురిడీ కొట్టించి భారీగా నగదు కాజేశారు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయిరాం ఎంక్లేవ్‌కు చెందిన ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగికి జూలై 11వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకును ఓపెన్ చేసి వివరాలను నమోదు చేయగానే ఓ ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు.ఈ క్రమంలో మొత్తం రూ.14.06 లక్షలు వేలు పెట్టుబడి పెట్టాడు. తాను పెట్టిన నగదుతోపాటు, వచ్చిన లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు చేసి, అనంతరం సోమవారం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

ట్రేడింగ్ పేరుతో ప్రైవేట్ ఉద్యోగి..

మరో ఘటనలో అమీన్‌పూర్ పరిధిలోని రూపవతి కాంటీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ట్రేడింగ్‌సంబంధించి ఏప్రిల్ 22వ తేదీన మెసేజ్ రావడంతో తన వివరాలు నమోదు చేశారు. అనంతరం రూ.1.30 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతో పాటు లాభాలను ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆన్‌లైన్ జాబ్ అంటూ..

అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి ఈ నెల 14వ తేదీ ఆన్ లైన్ జాబ్‌కు సంబంధించిన లింక్ వచ్చింది. బాధితుడు ఆ లింకును ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. వివరాలు నమోదు చేసిన వెంటనే రూ.5 వేలు చొప్పున, ఎనిమిది గపాలుగా మొత్తం రూ.40 వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. బాధితుడు అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబానికి పెద్ద ఆపద

ఆర్థిక సాయం కోసం ఎదురుచూపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వప్న

నారాయణఖేడ్: రెక్కాడితే కాని డొక్కాడని ఆ పేద కుటుంబానికి అనారోగ్య సమస్య వచ్చి పడింది. ఆ ఇల్లాలు ఆస్పత్రి పాలు కావడంతో ఇద్దరు చిన్నారులు, భర్త పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన స్వప్న (36), శంకరయ్యస్వామి దంపతులు. వీరికి 3వ తరగతి చదువుతున్న హర్షిత్ (8), ఒకటో తరగతి చదువుతున్న భవిత (4) సంతానం. స్వగ్రామంలో చిన్న పెంకుటిల్లు, అరెకరం పొలం ఉంది. గ్రామంలో బతుకుదెరువు లేకపోవడంతో హైదరాబాద్‌కు వలసవెళ్లి పానీపూరీ బండి నడుపుతూ శంకరయ్య కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్వప్నకు మూడేళ్ల కిందట నిమ్స్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ నిర్వహించారు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో మళ్లీ పరీక్షలు చేయించగా కిడ్నీలో ఇన్‌ఫెక్షన్ వచ్చినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మళ్లీ ఆపరేషన్ చేయాలని, రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో కుటుంబం తల్లడిల్లుతోంది. గతంలోనే రూ.6 లక్షల వరకు ఖర్చు చేసుకొని అప్పుల పాలయ్యామని వాపోయారు. ప్రభుత్వం, దాతలు స్పందించి ఆదుకోవాలని, ఆర్థిక సహాయం చేసేవారు 97031 10716 నంబరుకు అందించాలని శంకరయ్యస్వామి కోరుతున్నాడు.

భూ విక్రయంపై ఎస్పీకి ఫిర్యాదు

సంగారెడ్డి: తన అన్న అక్రమంగా భూమిని అమ్ముకొని తమకు అన్యాయం చేశారని ఎస్పీ కార్యాలయంలో ఇద్దరు చెల్లెల్లు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పటాన్‌చెరు మండలంలోని పెద్దకంజర్ల గ్రామంలోని ఓ సర్వే నంబర్‌లో తాతల కాలం నుంచి వస్తున్న భూమి ఎకరా నాలుగు గంటలను గొల్ల కృష్ణ భార్య లలిత పేరు మీద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ భూమిపై తమకు వాటా ఇవ్వాలని కృష్ణ చెల్లెళ్లు జనవరి 2022లో కోర్టులో కేసు పెట్టారు. కేసు పెండింగ్‌లో ఉండగానే కృష్ణ అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తికి భూమి అమ్మాడు. కోర్టు కేసులో ఉండగా భూమి రిజిస్ట్రేషన్ చేయొద్దని, పటాన్‌చెరువు ఎమ్మార్వో అప్పుడు అక్రమంగా డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేశాడని ఆరోపించారు. భూమిని విక్రయించడంపై పటాన్‌చెరు పీఎస్‌లో ఫిర్యాదు చేశామని, మండల ఆఫీసులో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. సోమవారం జిల్లా ఎస్పీకి మా భూమి మాకు ఇప్పించాలంటూ ఫిర్యాదు చేశారు.

భారీ చోరీ

- 16 తులాల బంగారం, రూ.3.20 లక్షల నగదు అపహరణ

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని లక్ష్మీపతిగూడెంలో భారీ చోరీ జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి కథనం ప్రకారం.. లక్ష్మీపతిగూడెం గ్రామానికి చెందిన బౌరంపేట ఆంజనేయులు కుటుంబ సభ్యులతో కలిసి జూన్ 26న ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లాడు. తిరిగి జూలై 6న ఇంటికొచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగిందని తెలుసుకొని ఈ విషయాన్ని పోలీసులకు చెప్పటంతో అప్పటి ఎస్‌ఐ విజయారావు ఆధ్వర్యంలో క్లూస్ టీంతో దర్యాప్తు చేపట్టారు. చోరీ విషయమై పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. చోరీ కేసు వివరాలను బయటకు రాకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. ఈ చోరీలో 16 తులాల బంగారం, రూ.3.20 లక్షల నగదును దొంగలు అపహరించుకెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. చోరీ జరిగి పది రోజులు గడుస్తున్నా తమకు న్యాయం జరగడం లేదని వాపోయాడు.

పీఎం కిసాన్ పేరుతో..

రూ.2 లక్షలు మాయం

శివ్వంపేట(నర్సాపూర్): పీఎం కిసాన్ పేరుతో వాట్సాప్‌లో వచ్చిన లింకును ఓపెన్ చేయగా సైబర్ నేరగాళ్లు రూ.2 లక్షలు లూటీ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి నవాబుపేట గ్రామానికి చెందిన నరేశ్‌గౌడ్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం అతడి ఫోన్‌కి పీఎం కిసాన్ పేరుతో లింకు వచ్చింది. పీఎం కిసాన్‌కు గతంలోనే దరఖాస్తు చేసుకున్నాడు. దానికి సంబంధించిన లింకు ఏదో వచ్చింది అనుకొని ఓపెన్ చేయడంతో సైబర్ నేరగాళ్లు అతడి అకౌంట్‌లో నుంచి రూ.లక్ష లూటీ చేశారు. అలాగే ఫోన్ హైంగ్ చేసి క్రెడిట్ కార్డు నుంచి మరో రూ.లక్ష లూటీ చేశారు. ఫోన్ కూడా పని చేయకపోవడంతో కంగుతిన్న నరేశ్‌గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హత్నూర(సంగారెడ్డి): కారు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సంగారెడ్డి మండలం గౌడి చర్ల గ్రామానికి చెందిన సాద్దుల్ నగర్ మధు(22) ఆదివారం రాత్రి కారులో గుండ్ల మాచునూర్ నుంచి ఇస్మాయిల్ ఖాన్‌పేటకు బయలుదేరాడు. మార్గమధ్యలో గుండ్ల మాచునూర్ గ్రామ సమీపంలోకి రాగానే కారు కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు హత్నూర పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

పని కోసం వెళ్లి యువకుడు..

శివ్వంపేట(నర్సాపూర్): పని కోసం వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దొంతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మనోహరాబాద్ మండలం పిట్టలవాడకు చెందిన పిట్టల శోభ, ఆమె కుమారుడు పిట్టల అర్జున్(22) దొంతిలోని వెంకట్‌రాంరెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో వాచ్‌మెన్‌గా సోమవారం పని కుదుర్చుకున్నారు. అందులో భాగంగా వ్యవసాయ క్షేత్రంలోని నీటితో నిండిన పాంపండ్‌ని అర్జున్ పరిశీలిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి దర్యాప్తు చేపడుతున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం

ట్యూషన్‌కు వెళ్లి బాలుడు..



గోపాల్ (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ట్యూషన్‌కు వెళ్లిన ఓ బాలుడు తిరిగి ఇంటికి రాలేదు. ఈ ఘటన జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. బొల్లారం సీఐ గంగాధర్ కథనం మేరకు.. బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప బస్తీలో నివాసం ఉంటున్న జన సురేందర్ కుమారుడు గోపాల్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో గోపాల్ ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గోవాకు వెళ్తున్నానని వెళ్లి వ్యక్తి..



రాజేందర్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి కర్రె రాజేందర్ శుక్రవారం ఇంట్లోంచి గోవా వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. తర్వాత అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతోపాటు సోమవారం వరకు రాజేందర్ ఆచూకీ తెలియలేదు. దీంతో తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బట్టలు ఇస్త్రీ చేయించుకొని వస్తానని..



నర్సింలు (ఫైల్)

తూప్రాన్: పట్టణ కేంద్రంలో యువకుడు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ 2 యాదగిరి కథనం మేరకు.. పట్టణంలోని 1వ వార్డుకు చెందిన ఉదుత నర్సింలు(33) ఈ నెల 8న బట్టలు ఇస్త్రీ చేయించుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు వద్ద, చుట్టుపక్కల వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని..

హెచ్‌ఎం సహా మరొకరికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో హెచ్‌ంతోపాటు మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. కౌడిపలి గ్రామానికి చెందిన మట్ట బుచ్చిరెడ్డి కంచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం నర్సాపూర్‌లో పాఠశాల నిధుల ఆడిట్ ఉండటంతో తన బైక్‌పై నర్సాపూర్ వెళ్లి పనులు చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్నారు. రాయిలాపూర్‌గేట్ సమీపంలోనికి రాగా నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభు తన బైక్‌పై నర్సాపూర్ వైపు వెళుతున్నాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో హెచ్‌ఎం బుచ్చిరెడ్డితోపాటు కుమ్మరి ప్రభు ఇద్దరికి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బుచ్చిరెడ్డిని కుటుంబ సభ్యులు హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిల్లర కష్టాలు



- దొరకని రూ.10, రూ.20, రూ.50 నోట్లు
- మార్కెట్‌లో వ్యాపారులు, ప్రజలకు తిప్పలు
- కమీషన్‌తో రూ.10 నోట్లు ఇస్తున్న బడా వ్యాపారులు

సిద్దిపేటకమాన్: రోడ్డు పక్కన ఉన్న టీ స్టాల్‌లో టీ తాగాలన్నా, పానీ పూరీ తినాలన్నా, మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి షాపు యజమానికి డబ్బులు చెల్లించడానికి, తిరిగి వారు చిల్లర ఇవ్వడానికి ఇటు ప్రజలు అటు వ్యాపారస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇందుకు కారణం మార్కెట్‌లో రూ.10, రూ.20, రూ.50 నోట్లు దొరక్కపోవడమే. ప్రస్తుతం డిజిటల్ ప్రపంచంలో ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్ పేమెంట్‌లు వచ్చాయి. ఈ క్రమంలో ఈ చిల్లర సమస్య తలెత్తుతుంది. బ్యాంకు అధికారులు ఈ చిల్లర సమస్యను పరిష్కరించి రూ.10. రూ.20, రూ.50 నోట్లను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

కనిపించని రూ.10 నోట్లు

జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలో వివిధ రకాల వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. చాలా దుకాణాల్లో ఫోన్ పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే సదుపాయం లేదు. ఈ దుకాణాల్లో వినియోగదారులు వారికి కావాల్సిన వస్తువులు కొనుగోలు చేశాక డబ్బులు చెల్లించడంతో చిల్లర సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా వ్యాపారస్తులు సైతం తిరిగి వినియోగదారులకు చిల్లర డబ్బులు ఇచ్చే క్రమంలో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.10 నోట్లు ఎక్కువగా చిరిగినవి రావడంతో వాటిని తీసుకోవడానికి వ్యాపారస్తులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుల్లో డిపాజిట్ అయిన రూ.10, రూ.20 నోట్లు ఖాతాదారులు ఎవరూ కూడా తీసుకోవడానికి సుముఖత చూపడం లేదు. దీంతో మార్కెట్‌లో నోట్ల కొరత ఏర్పడుతోంది. రూ.10 నాణేలు కూడా చెల్లవేమోనని అయోమయంతో కొంత మంది వ్యాపారస్తులు, వినియోగదారులు నాణాలు తీసుకోవడం లేదు. ప్రజలకు రూ.10 నాణాలపైన ఉన్న అపోహలను బ్యాంకు అధికారులు పోగొట్టి వాటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

రూ.30 కమీషన్‌తో వెయ్యి..

మార్కెట్‌లో రూ.10, రూ.20 నోట్ల కొరత ఏర్పడడంతో కొందరు బడా వ్యాపారులు ఇదే అదునుగా తమ చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తమ దగ్గరకు వచ్చే చిన్న చిన్న వ్యాపారస్తులకు రూ.30 నుంచి రూ.50 కమీషన్ తీసుకొని రూ.10 నోట్లతో కూడిన వెయ్యి రూపాయల కట్టను చెల్లిస్తున్నారు. బ్యాంక్ అధికారులు రూ.10 నోట్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రూ.10 నోట్ల కొరత ఉంది

గ్రామాల నుంచి వచ్చే వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేయలేక డబ్బులు ఇస్తుంటారు. వారికి తిరిగి చెల్లించే చిల్లర డబ్బుల విషయంలో సమస్యగా తలెత్తుతుంది. రూ.10 నోట్లు ఎక్కువగా చిరిగినవి ఉండడంతో వినియోగదారులు తీసుకోవడం లేదు. బ్యాంకు అధికారులు స్పందించి రూ.10 నోట్లు అందుబాటులో ఉంచేలా చూడాలి.

– బొల్లబోయిన శ్రీనివాస్ యాదవ్, మొబైల్ షాపు నిర్వాహకుడు

అందుబాటులో ఉంచుతాం

ఆర్‌బీఐ గైడ్ లైన్స్ ప్రకారం బ్యాంకుల్లో వీలైనంత త్వరలో చిరిగిన నోట్ల స్థానంలో కొత్త నోట్లు అందుబాటులోకి వస్తాయి. నోట్లు మడత బడడం, చిరిగిపోవడంతో బ్యాంకుల్లోనే నిల్వ ఉన్నాయి. వాటి స్థానంలో రూ.10 నాణెలు అందుబాటులో ఉన్నాయి. రూ.10 నాణాలు చెల్లుబాటు కావనేవి అపోహ మాత్రమే.

– హరిబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్, సిద్దిపేట

పత్తి చేను దున్నేశారు

- అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారు
- అదనపు ఎస్పీకి రైతు ఫిర్యాదు



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్‌మున్సిపాలిటీ: నా సొంత పొలంలో పత్తి పంట వేసుకుంటే మా గ్రామానికి చెందిన కొందరు దాన్ని దున్నేశారని, అడిగితే చంపుతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని టేక్మాల్ మండలం పాల్వంచకు చెందిన రైతు మల్లేశం అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ మహేందర్ జిల్లాస్థాయి ప్రజావాణి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అందజేసిన ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా బాధిత రైతు తనకు జరిగిన నష్టాన్ని వివరించారు. పత్తి చేను ధ్వంసం చేయడంతో సుమారు రూ. లక్ష నష్టం జరిగిందని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన అదనపు ఎస్పీ చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని సంబంధిత సీఐకి సూచించారు. అలాగే ఈనెల 9న యాదగిరి అనే వ్యక్త గడ్డపారతో మా ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న టీవీని పగులకొట్టాడని మెదక్ పట్టణానికి చెందిన మ్యాదరి ఫిర్యాదు చేశారు. ఇదేంటని అడిగితే తనపై దాడి చేస్తున్నాడని వాపోయింది. స్పందించిన అదనపు ఎస్పీ చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయాలని మెదక్ పట్టణ సీఐకి సూచించారు.